# సాక్షి
## యాదాద్రి భువనగిరి
గురువారం । 14 । సెప్టెంబర్ । 2023






**ప్రతిభను వెలికితీసేందుకు..**
ప్రతిభను వెలికితీసేందుకు క్రీడాపోటీలు దోహదపడతాయని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. - 8లో



**కమ్యూనిస్టుల పాత్ర కీలకం**
ప్రజా ఉద్యమాల్లో కమ్యూనిస్టుల పాత్ర కీలకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. - 10లో



**'వాసాలమర్రి' పనులపై సమీక్ష**
వాసాలమర్రి గ్రామ పునర్నిర్మాణ పనులపై కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. - 10లో

## న్యూస్‌రీల్

### కొనసాగుతున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ

భువనగిరి: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. బదిలీల కోసం మొత్తం 2,260 దరఖాస్తులు రాగా అందులో 18 దరఖాస్తులను తిరస్కరించారు. ప్రస్తుతం బదిలీల కోసం 2,242 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ నెల 11, 12వ తేదీల్లో దరఖాస్తులపై 133 అభ్యంతరాలు వచ్చాయి. వీటిలో 66 అభ్యంతరాలను పరిశీలించి, 67 అభ్యంతరాలను తిరస్కరించారు. బుధవారం సీనియార్టీ జాబితాను ప్రకటించారు. జిల్లాలో మొదటగా జీహెచ్ఎంల బదిలీలు మల్టీజోన్-2 కింద జరగనున్నాయి. జిల్లాలో మొత్తం 84 ఖాళీలు ఉండగా 39 మంది తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారు ఉన్నారు.

### కలెక్టరేట్‌ను సందర్శించిన అధికారుల బృందం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరిటౌన్: భారత్ దర్శన్, స్టడీ టూర్‌లో భాగంగా 21 మంది జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం బుధవారం కలెక్టరేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించి పనితీరు, భూరికార్డులు, ధరణి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు వారికి రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు.

### ఆయుష్మాన్ భవ సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి: గ్రామీణ స్థాయి ప్రజలకు ఆయుష్మాన్ భవ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి కోరారు. బుధవారం భువనగిరి పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్‌గా ఆయుష్మాన్ భవ సేవలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యాన్ని అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతుందన్నారు. డీఎంహెచ్ఓ మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆయుష్మాన్ భవ సేవా కార్యక్రమాల్లో భాగంగా 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఆయుష్మాన్ భవ కార్డులు అందించడం, ఇమ్యూనైజేషన్, టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. టీబీ రోగులకు పోషణ, చికిత్సలో సహకరించిన ఆరోగ్య కార్యకర్తలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ కోల్పుల అమరేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ చిన్ననాయక్, డీఎల్ఓ డాక్టర్ పాపారావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమన్ కళ్యాణ్, వినోద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### జీవ ఎరువులు వాడాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

యాదగిరిగుట్ట రూరల్: పంటల సాగులో జీవ ఎరువులు వాడితే మంచి ఫలితాలు ఉంటాయని, ఖర్చులు కూడా తగ్గుతాయని జిల్లా వ్యవసాయాధికారి అనురాధ తెలిపారు. బుధవారం యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలో అజీవ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ నిర్వహించిన 6వ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. పప్పు దినుసులు తయారు చేసే మిషన్లను ఏర్పాటు చేసి, అజీవ బ్రాండ్‌తో ప్యాకెట్లు చేసి, మార్కెట్‌లోకి విడుదల చేయాలన్నారు. ఇన్‌పుట్ బిజినెస్‌తో పాటు, అవుట్‌పుట్ వ్యాపారంతో ఎక్కువ లాభాలు గడించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పీస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య, ఏడీఏ పద్మావతి, డాటా సెంటర్ శాస్త్రవేత్త మమత, ఏఈఓ లావణ్య, అజీవ సంస్థ అధ్యక్షులు గుజ్జుక ఎల్లుబాయ్, ఎంపీటీసీ కొక్కలకొండ అరుణ, దివ్యశ్రీ, అజీవ సెక్రటరీ స్వరూప, డైరెక్టర్లు లక్ష్మి, సునీత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.





### యూరియా కోసం రైతుల నిరీక్షణ

అడ్డగూడూరు: యూరియా కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. అడ్డగూడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులు యూరియా కోసం బుధవారం ఉదయం 7గంటల నుంచే చెప్పులను క్యూలైన్‌లో పెట్టారు. రైతులకు 5 నుంచి 10 బస్తాల వరకు యూరియా అవసరముండగా.. అధికారులు రెండు, నుంచి మూడు బస్తాలు మాత్రమే ఇస్తుండడంతో సుమారుగా 20 మంది రైతులు యూరియా బస్తాలు దొరక్క వెనుదిరిగారు.

# 'కమలం'లోనూ భారీగానే..

- ఒక్కో నియోజకవర్గానికి కనీసంగా ఐదుగురు.. గరిష్టంగా 24 మంది దరఖాస్తు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే వారికి టికెట్ కేటాయించేలా అధిష్టానం కసరత్తు
- పోటీచేసే అవకాశం ఎవరికొస్తుందోనని బీజేపీలో చర్చ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీజేపీలో ఆశావహులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో నియోజకవర్గంలో కనీసంగా ఐదుగురి నుంచి 24 మంది వరకు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తరహాలోనే బీజేపీ కూడా ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించింది. ఆశావహుల నుంచి వచ్చిన దరఖాస్తులను ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర నాయకత్వం పరిశీలిస్తోంది. కోదాడ, నకిరేకల్ నియోజకవర్గాల్లో భారీ సంఖ్యలో ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే అందులో ఎవరికి టికెట్ వస్తుందో కొద్ది రోజుల్లో తేలే అవకాశం ఉంది.

**టికెట్ వారికే పక్కా అని తెలిసినా..**

ఉమ్మడి జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో కొంత మంది ముఖ్య నేతలకు టికెట్ వస్తుందని పక్కాగా తెలిసినా ఆశావహులు తమ ప్రయత్నాలు మానుకోలేదు. మునుగోడులో గత ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికే టికెట్ ఇస్తారనే విషయం పక్కాగా తెలిసినా అనుకోని పరిస్థితుల్లో ఏమైనా మార్పు వస్తే తమకు అవకాశం వస్తుందనే ఆశతో పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

**టికెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారు..**

- నల్లగొండ : మాదగోని శ్రీనివాస్‌గౌడ్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, పాలకూరి రవిగౌడ్.
- మునుగోడు : కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దోనూరు వీరారెడ్డి, రమణగోని శంకర్, ఏనుగు సుధాకర్‌రెడ్డి, పాలకూర్ల జంగయ్యగౌడ్, చినుకుని మల్లేశం, చినుకుని హరిప్రసాద్, వేదాంతం గోపీనాథ్, యాస అమరేందర్ రెడ్డి.
- నకిరేకల్ : ఈ నియోజకవర్గంలో టికెట్ కోసం 23 మంది దరఖాస్తు చేశారు. వారిలో నలుగురు ఇతర జిల్లాల వారు ఉన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారిలో చేపూరి రవీందర్, గోలి ప్రభాకర్, నకిరేకంటి మొగులయ్య, కొండేటి శ్రీను, పోతెపాక సాంబయ్య, వేముల అశోక్, బుడిగె సైదులు, పోతెపాక లింగస్వామి, జిట్టా కృష్ణ, జగ్జీవన్, గంజి అనిల్, బండారు శైలజ, ఎడ్ల రమేష్, గోలి మహేశ్వరి, చినేని జానీ, పాలడుగు నాగేష్, మొరుసు భిక్షపతి, బాకి నరసింహ, కూరెళ్ల శ్రీను.
- దేవరకొండ : కేతావత్ లాలునాయక్, జరుపుల కళ్యాణ్‌నాయక్, బిచ్యానాయక్, సుమన్‌నాయక్, వినోద్ రాథోడ్, అంజినాయక్.
- నాగార్జునసాగర్ : కంకణాల నివేదితరెడ్డి, రిక్కల ఇంద్రసేనారెడ్డి, కొంపల్లి శ్రీనివాస్, డాక్టర్ పానుగోతు రవికుమార్, మరొకరు దరఖాస్తు చేశారు.
- మిర్యాలగూడ : సాధినేని శ్రీనివాస్‌రావు, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, చిలుకూరు శ్యాం, కొండేటి సరిత, రేపాల పురుషోత్తంరెడ్డి, పల్నాటి వెంకటరెడ్డి, జువ్వాది సత్యనారాయణ, బాషా, కంచుకొమ్ముల వేణు, చింత సాంబమూర్తి.
- సూర్యాపేట : సంకినేని వెంకటేశ్వరరావు, బూర మల్సూర్, బోళ్ల కరుణాకర్, పాండురంగాచారి, తన్నీరు వాసు, కోడి లింగయ్య, జటంగి సురేష్, శ్రీను నాయక్.
- తుంగతుర్తి : కడియం రామచంద్రయ్య, పాల్వాయి రజినికుమారి, పేరాల పూలమ్మ, మల్లేపాక సాయిబాబా, గద్దల అంజిబాబు, కడియం కళ్యాణ్ చందర్, ధర్మారం వెంకన్న, పల్లె రాములు.
- కోదాడ : ఇక్కడ టికెట్ కోసం 24 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ప్రధానంగా నూకల పద్మావతిరెడ్డి, ఓర్స్ వేలంగి రాజు, బొలిశెట్టి కృష్ణయ్య, వంగవీటి శ్రీనివాసరావు.
- హుజూర్‌నగర్ : బొబ్బా భాగ్యరెడ్డి, గట్టు శ్రీకాంత్‌రెడ్డి, బి.అరవిందరెడ్డి, బాలాజీనాయక్, జి.శేషిరెడ్డి, బాల్సన్‌నాయక్, మేకల వెంకటేశ్వర్లు, పోకల వెంకటేశ్వర్లు.
- భువనగిరి : గూడూరు నారాయణరెడ్డి, మాయ దశరథ, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, సీఎస్‌రెడ్డి, పాశం భాస్కర్, వేముల అశోక్, భువనగిరి శ్రీనివాస్ నేత.
- ఆలేరు : పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, రచ్చ శ్రీనివాస్, బొమ్మగాని రాజమణి, సుదగాని హరిశంకర్‌గౌడ్, కల్లెం శ్రీనివాస్‌గౌడ్, తాళ్ల బాస్కర్‌రెడ్డి, కర్రె ప్రవీణ్‌యాదవ్, రావు మల్లేష్, తడిసిన మల్లారెడ్డి, పీసరి తిరుమలరెడ్డి, పన్నాల చంద్రశేఖర్‌రెడ్డి.

**టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు**

పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి పనిచేసి ఎదిగిన వారితోపాటు మధ్యలో పార్టీలో చేరిన వారు టికెట్ ఆశిస్తున్నారు. ఎలాగైనా టికెట్ సాధించాలనే లక్ష్యంతో నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలను కొనసాగిస్తూ నిత్యం ప్రజల్లో ఉంటున్న వారంతా దరఖాస్తు చేసుకున్నారు. త్వరలో మొదటి విడత జాబితాను ప్రకటిస్తారనే చర్చ సాగుతున్న నేపథ్యంలో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పార్టీలో కీలక పదవుల్లో ఉన్న నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అయితే క్షేత్ర స్థాయిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ఢీకొనే స్థాయి కలిగిన వారికే టికెట్లను కేటాయించేలా బీజేపీ అగ్ర నాయకత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో టికెట్ ఎవరికి వస్తుంది.. ఎవరికి రాదనే విషయంపై నేతలు అంచనాలు వేసుకుంటున్నారు.

# భువనగిరికి ఠాక్రే

- 18న భువనగిరి, ఆలేరు అసెంబ్లీ సెగ్మెంట్ల సమావేశం
- కాంగ్రెస్ గ్యారంటీ స్కీంలపై ప్రచారం.. పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం
- కార్యకర్తల ఇళ్లలో సహఫంక్తి భోజనం
- ఠాక్రే పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్న నాయకులు



సాక్షి, యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ పార్టీ తన కార్యాచరణలో వేగం పెంచింది. ఈ నెల 17 తుక్కుగూడలో జరిగే సభ తర్వాత.. కాంగ్రెస్ పార్టీ ఐదు పథకాల హామీపై ప్రచారాన్ని ముమ్మరం చేయనుంది. అదే విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై చార్జీషీట్‌ను ప్రజల్లోకి తీసుకుపోవడానికి ఒక రోజు ముఖ్యనేత కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా యాదాద్రి జిల్లాకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్‌రావు ఠాక్రే హాజరవుతున్నారు. భువనగిరి, ఆలేరు రెండు నియోజకవర్గాలను కలిపి ఒకే చోట సమావేశం నిర్వహించాలని పీసీసీ నిర్ణయించింది. తుక్కుగూడలో కాంగ్రెస్ విజయభేరీ సభ ముగియగానే ఠాక్రేతోపాటు, ఎంపీ కోమటిరెడ్డి ఇతర ముఖ్య నాయకులు జిల్లాకు చేరుకుని రాత్రి ఇక్కడే బస చేస్తారు. 18వ తేదీ ఉదయం పీసీసీ సెక్రటరీలు, డెలిగేట్‌లు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ సమావేశం తీర్మానాలు, విజయభేరీ సభలో ప్రకటించే ఐదు గ్యారెంటీ స్కీంల ప్రచారం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడంపై దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం జిల్లాలో ఒక చోట.. ఐదు గ్యారెంటీ స్కీంల వాల్‌పోస్టర్‌ను అంటించి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారు. కాంగ్రెస్ కార్యకర్తల ఇళ్లలో సహఫంక్తి భోజన కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం గాంధీ, అంబేద్కర్, జగ్జీవన్‌రాం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం ఠాక్రే తిరిగి హైదరాబాద్ వెళ్తారు.

**గ్యారంటీ కార్డులు నియోజకవర్గానికి వెయ్యి..**

సోనియాగాంధీ ప్రకటించే ఐదు గ్యారంటీ స్కీంలపై కార్డులతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంపై చార్జ్‌షీట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లతో కాంగ్రెస్ నాయకులు ఊరూరా ప్రచారం చేస్తారు. గ్యారంటీ కార్డులను ప్రతి నియోజకవర్గానికి వెయ్యి చొప్పున పంపిణీ చేస్తారు. వాల్‌పోస్టర్లను గ్రామాల్లో గోడలకు అతికిస్తారు. గ్యారెంటీ కార్డులను ఇంటింటికి పంపిణీ చేస్తారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు కార్డుల ఆధారంగా నిలదీయవచ్చన్న నమ్మకం కలిగించేందుకు ఈ కార్డులు రూపొందిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పారు.

**జన సమీకరణలో నిమగ్నం**

17న సాయంత్రం జరిగే కాంగ్రెస్ విజయభేరీ సభకు జన సమీకరణలో జిల్లా కాంగ్రెస్ నాయకులు నిమగ్నమయ్యారు. యాదాద్రి జిల్లా హైదరాబాద్‌కు పొరుగునే ఉండడంతో సోనియాగాంధీ సభకు ఈ జిల్లా నుంచి భారీగా జన సమీకరణ చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక సీనియర్ నాయకుడికి బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా జిల్లాలో 18న రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్‌రావు ఠాక్రే సమావేశానికి కూడా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలు పక్కపక్కనే ఉన్నందున సమావేశం ఒకే చోట నిర్వహించాలని నిర్ణయించారు.

# చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



బోగ బాలయ్య నేసిన భారతదేశం చిత్రం కలిగిన స్కార్ఫ్‌ను పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: చేనేతలకు అనేక పథకాలు అమలు చేస్తూ వారి సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రానికి చేనేత కళాకారుడు బోగ బాలయ్య నివాసాన్ని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మగ్గంపై నేసిన భారతదేశ చిత్రం కలిగిన స్కార్ఫ్‌ను, ఇక్కత్ వస్త్రాలను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత నెల 7న జాతీయ చేనేత దినోత్సవం రోజున ప్రభుత్వం ప్రకటించినట్లు ప్రతిమగ్గానికి చేనేతమిత్ర పథకం కింద ఈ నెల నుంచే చేనేత కార్మికుడి ఖాతాలో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. పోచంపల్లి ఇక్కత్ హ్యాండ్లూమ్ డిజైన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రొడక్షన్ సెంటర్‌ను మంజూరు చేయాలని చేనేత కళాకారుడు బోగ బాలయ్య కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా పోచంపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పర్యాటక కేంద్రమైన పోచంపల్లికి మినీట్యాంక్ ఏర్పాటు, సబర్బన్ బస్సులు నడిపించేలా కృషి చేయాలని విద్యార్థులు కోరగా.. రెండో దశలో మినీట్యాంకు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. వ్యాపారులకు అనువైన సమయాల్లో దిల్‌సుఖ్‌నగర్‌కు డిపోకు చెందిన బస్సులు నడిపించాలని స్థానిక నాయకులు కోరగా మంత్రి స్పందించి డిపో మేనేజర్‌తో మాట్లాడారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, రావుల శేఖర్‌రెడ్డి, పాటి సుధాకర్‌రెడ్డి, చిల్వేరు బాలనర్సింహ, సీత వెంకటేశం, గునిగంటి మల్లేశ్, కౌన్సిలర్లు తదితరులున్నారు.

### మాద్గుల యాదిరెడ్డికి నివాళి



యాదిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

పోచంపల్లి ఎంపీపీ మాద్గుల ప్రభాకర్‌రెడ్డి సోదరుడు మాద్గుల యాదిరెడ్డి(73) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. మండలంలోని పెద్దగూడెంలో ఉన్న ఆయన స్వగృహంలో యాదిరెడ్డి మృతదేహానికి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఏపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. వారిలో జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, రావుల శేఖర్‌రెడ్డి, గోరంటి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు చిల్వేరు బాలనర్సింహ, బందారపు లక్ష్మణ్, సర్పంచ్ మన్నె పద్మారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఉన్నారు.

# భూసేకరణను వేగవంతం చేయాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సాక్షి,యాదాద్రి: టీఎస్ఐఐసీ, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టు, యాదగిరిగుట్ట డెవలప్‌మెంట్ పనులకు సంబంధించి భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సమీక్షా సమావేశంలో ఇచ్చిన ఆదేశాల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూమి నష్టపరిహారం పంపిణీ వేగవంతం చేయాలని భూసేకరణ అధికారులకు సూచించారు. నృసింహసాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో మునిగిపోతున్న బీఎన్ తిమ్మాపూర్ గ్రామకంతంకు అవార్డును ఆమోదించారు. లప్పనాయక్ తండా గ్రామకంతం ఇళ్లకు నష్టం పరిహారాన్ని త్వరలో పంపిణీ చేయాలని నిర్ణయించారు. చోక్లనాయక్ తండాలకు సంబంధించిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఇళ్ల సర్వే చేయించాలని నిర్ణయించారు. సమీక్షా సమావేశంలో ప్యాకేజీ -14, 15, 16 కెనాల్స్ భూసేకరణ కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు అమరేందర్, జగన్నాథరావు, ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూలకు బిందె తీర్థం, ఆరాధన గావించారు. శ్రీస్వామి వారికి బాలభోగం చేపట్టిన తరువాత నిజాభిషేకం జరిపించారు. శ్రీస్వామివారికి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు శ్రీస్వామి వారి దర్శనం భాగ్యం కల్పించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలు, రాత్రి పవళింపు సేవ నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు.

# పల్లెల ప్రగతే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత





కొలనుపాక సర్పంచ్ లక్ష్మీప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, కలెక్టర్

సాక్షి, యాదాద్రి: పల్లెల ప్రగతే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2023లో భాగంగా జిల్లాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 15 గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలను బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పట్టుదలతో గ్రామాల అభివృద్ధిని కాంక్షించి పనిచేస్తున్నారన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమాలను ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తోందని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామానికి మంచినీరు అందిస్తున్నామన్నారు. గొలుసుకట్టు చెరువులు, కాలువలు, మిషన్ కాకతీయలో చేపట్టిన పనులతో ఆలేరు నియోజకవర్గంలో వరి విస్తీర్ణం పెరిగిందన్నారు. కలెక్టర్ వినయ్ కష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023కు జిల్లాకు చెందిన 15 గ్రామ పంచాయతీలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయని చెప్పారు. వీటిలో ఆలేరు మండలంలోని కొలనుపాక, ఆత్మకూరు (ఎం), సంస్థాన్ నారాయణపూర్, పుట్టపాక, రామన్నపేట మండలంలోని సిరిపురం, చౌటుప్పల్ మండలంలోని ఎస్.లింగోటం, తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి, మోత్కూరు మండలంలోని దాచారం, రాజాపేట మండలంలోని రేణికుంట, వలిగొండ మండలంలోని సంగెం, అడ్డగూడూరు మండలంలోని గోవిందాపూర్, భువనగిరి మండలంలోని తుక్కాపూర్, బీబీనగర్ మండలం అన్నంపట్ల, పోచంపల్లి మండలం జలాల్ పూర్, యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్ గ్రామ పంచాయతీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను సన్మానించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీసీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి, డీపీఓ సునంద, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదుపై ముమ్మర ప్రచారం

- కళాశాలలు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు
- కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఈవీఎం ప్రదర్శన కేంద్రాల ఏర్పాటు



భువనగిరి బస్టాండ్‌లో ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

భువనగిరిటౌన్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది. అంతేకాకుండా ఓటరు కార్డులో మార్పులు, చేర్పుల అవకాశం కల్పించింది. ఈమేరకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కళాశాలలు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా మొబైల్ వాహనాల ద్వారా ఈవీఎం , వీవీప్యాట్ యంత్రాలపై అవగాహన కల్పిస్తున్నారు. కలెక్టరేట్, ఆలేరు తహసీల్దార్ కార్యాలయాల్లో ఈవీఎం ప్రదర్శన కేంద్రాలు ఏర్పాటు చేసి ఓటు వేసే విధానంపై ప్రజలకు వివరిస్తున్నారు. కాగా.. 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించుకోని వారు ఫారం 6, ఇతర ప్రాంతానికి శాశ్వతంగా వెళ్లినవారు, మృతిచెందిన వారి పేర్లు తొలగించేందుకు ఫారం 7, జాబితాలో పేరు ఉండి సెల్ నెంబర్, ఇంటి నంబర్, తల్లి, తండ్రి పేరులో ఏమైనా తప్పులు ఉంటే సరి చేసుకునేందుకు వీలుగా ఫారం 8ను సమర్పించాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఓటరు దరఖాస్తు ఫారాలకు ఫొటోతోపాటు, ఆధార్ కార్డు జతచేయాల్సి ఉంటుంది.

**జిల్లాలో 4.27లక్షల మందికిపైగా ఓటర్లు**

ఆగస్టు 21 తేదీ వరకు భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించారు. భువనగిరి నియోజకవర్గానికి సంబంధించి 2,06,883 ఓటర్లు, ఆలేరు నియోజకవర్గంలో 2,20,638 మంది ఓటర్లు, మొత్తంగా 4,27,471 మంది ఓటర్లు ఉన్నాయి.

**ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి**

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలని అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు కోరారు. తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనపై బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19 వరకు నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల వారు తమ ఏజెంట్లను నియమించి బూత్ స్థాయి అధికారులతో కలిసి స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు జహంగీర్, బంటు రామచంద్రయ్య, యాకూబ్, ఎన్. నర్సింగరావు, నితీష్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కోతుల దాడిలో మహిళకు గాయాలు


గాయపడిన వీరమ్మకు కట్టుకడుతున్న గ్రామస్తుడు

**అర్వపల్లి:** మండల పరిధిలోని పర్సాయపల్లి గ్రామానికి చెందిన ఆవుల వీరమ్మ బుధవారం తన ఇంటి ఎదుట కూర్చొని ఉండగా కోతులు ఆమెపై దాడి చేసి గాయపర్చాయి. చుట్టుపక్కల వారు కర్రలు పట్టుకొని వచ్చి కోతులను అక్కడి నుంచి తరిమేశారు. గాయాలపాలైన వీరమ్మను చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఇప్పటికే గ్రామంలో ఇద్దరు వ్యక్తులు కోతుల దాడిలో తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు.

### ఐదుగురు జూదరుల అరెస్టు

**ఆలేరురూరల్:** ఆలేరు పట్టణ కేంద్రంలో మంగళవారం రాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణంలోని దాసి సంతోష్ ఇంట్లో మంగళవారం రాత్రి కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు రాత్రి పదకొండు గంటల సమయంలో ఆ ఇంటిపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న దర్శనం విజయ్, భోగల కృష్ణ, దాసి సంతోష్, జైనుద్దీన్, గోపగాని సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.58,930 నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతి

**దేవరకొండ:** గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి దేవరకొండ మండలంలోని కొమ్మేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. దేవరకొండ సీఐ నాగభూషణం తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాలోని సింగరేణి ప్రాంతానికి చెందిన చిమ్మల నరేశ్(31) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని టేకులపల్లి నుంచి బొగ్గు లోడుతో దేవరకొండ మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలుకు బయల్దేరాడు. మార్గమధ్యలో దేవరకొండ మండలం పడ్మట్‌పల్లి గ్రామ శివారుకు చేరుకోగానే లారీ టైరు పంక్చర్ అయ్యింది. దీంతో లారీని అక్కడే నిలిపి కొమ్మేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పంక్చర్ షాపు వద్దకు వెళ్లి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నరేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

### గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి


రాజేంద్రప్రసాద్ (ఫైల్)

**హుజూర్‌నగర్‌రూరల్ :** హుజూర్‌నగర్ మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రణపంగు రాజేంద్రప్రసాద్(43) గుండెపోటుతో మృతిచెందాడు. రాజేంద్రప్రసాద్‌కు బుధవారం ఛాతిలో నొప్పి రావడంతో స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించుకున్నాడు. నొప్పి పెరగడంతో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు మఠంపల్లి మండలం యాతవాకిళ్ల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు కూడా అందుకున్నారు.

# ఐదు నెలలుగా మంచానికే పరిమితం

- రోడ్డు ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన ఇంటి పెద్ద
- చికిత్స కోసం రూ.16లక్షలు ఖర్చు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబం
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు

కన్నీటి గాథ


వెంకటేశ్వర్లుకు అన్నం తినిపిస్తున్న భార్య నర్మద

**మునగాల(కోదాడ):** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇంటి పెద్ద మంచానికే పరిమితమయ్యాడు. అతడి కుటుంబ సభ్యులు అప్పులు చేసి మరీ అతడికి వైద్యం చేయించారు. ప్రస్తుతం కుటుంబ పోషణ భారంగా మారడంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. వివరాలు.. మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మొలుగూరి నారాయణ, జయమ్మ దంపతుల రెండో కుమారుడు వెంకటేశ్వర్లు(36) డిగ్రీ పూర్తిచేసి ఓ మెడికల్ కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ 15న తన బైక్‌పై వెళ్తుండగా మరో బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు తలకు బలమైన గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నల్లగొండ పట్టణంలోని ఐకాన్ ఆస్పత్రిలో చేర్పించి తలకు ఆపరేషన్ చేయించారు. వైద్యం అందిస్తుండగానే వెంకటేశ్వర్లు కోమాలోకి వెళ్లాడు. వైద్యం కోసం కుటుంబ సభ్యులు అప్పు చేసి సుమారు రూ.10 లక్షలు ఖర్చుపెట్టారు. నెల రోజుల చికిత్స అనంతరం ఫిజియోథెరపి చేయించాలని వైద్యులు సూచించడంతో వెంకటేశ్వర్లును హైదరాబాద్‌లోని బ్రినోవా ఆస్పత్రిలో చేర్పించి నెల రోజుల పాటు రూ.2లక్షలు వెచ్చించి చికిత్స అందించారు. అనంతరం వైద్య ఖర్చులు భరించలేక ఇంటికి తీసుకొవచ్చారు. నెల రోజుల క్రితం వెంకటేశ్వర్లు తలకు రెండోసారి ఐకాన్ ఆస్పత్రిలో ఆపరేషన్ జరిగింది. వెంకటేశ్వర్లు ప్రాణాలైతే దక్కాయి కాని జ్ఞాపకశక్తి కోల్పోయి ఇంటి వద్ద మంచానికే పరిమితమయ్యాడు. దీంతో వెంకటేశ్వర్లు భార్య నర్మద అతడికి సపర్యలు చేస్తుంది. వీరికి పదేళ్ల లోపు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ప్రస్తుతం వెంకటేశ్వర్లు కుటుంబాన్ని అతడి తల్లిదండ్రులు పోషిస్తున్నారు. ప్రతి నెల మందులకు రూ.12వేల ఖర్చవుతుందని, ఇప్పటి వరకు రూ.16.50లక్షలు తమ సోదరుడికి ఖర్చు చేసినట్లు వెంకటేశ్వర్లు అన్న రమేష్ తెలిపాడు. వెంకటేశ్వర్లు ముగ్గురు పిల్లల పోషణ ఆ కుటుంబానికి భారంగా మారింది. దయార్ధ హృదయులు స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వెంకటేశ్వర్లు భార్య వేడుకుంటుంది.

**ఆర్థికసాయం చేయదలచుకున్న దాతలు సంప్రదించాల్సిన వివరాలు**
పేరు: మొలుగూరి నర్మద
బ్యాంకు ఖాతా నంబర్: 7313903356-1
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, మునగాల బ్రాంచ్
గూగుల్ పే, ఫోన్ పే నంబర్: 8919526680

**పోషణ భారంగా మారింది**



రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకున్న నా భర్త ఐదు నెలలుగా జ్ఞాపకశక్తి కోల్పోయి మంచానికే పరిమితమయ్యాడు. మా కుటుంబ సభ్యులు అప్పు చేసి ఇప్పటివరకు వైద్యం చేయించారు. ప్రస్తుతం మా పిల్లల పోషణ భారంగా మారింది. ప్రతి నెల రూ.12వేలు మందులకు వెచ్చించాల్సి వస్తుంది. నా భర్త తిరిగి మామూలు మనిషి కాగలడన్న నమ్మకంతో జీవిస్తున్నాను. దాతలు స్పందించి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.
– మొలుగూరి నర్మద, వెంకటేశ్వర్లు భార్య

# రోడ్డు ప్రమాదంలో యువ జంట దుర్మరణం

- బైక్‌పై వెళ్తుండగా ఢీకొట్టిన ఇసుక ట్రాక్టర్
- ఘటనా స్థలంలోనే యువకుడు మృతి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచిన యువతి
- నెల రోజుల క్రితమే ప్రేమ పెళ్లి చేసుకున్న మృతులు


మహేష్, రుషిత (ఫైల్)

**నకిరేకల్:** నెల రోజుల క్రితమే ప్రేమించి పెళ్లి చేసుకున్న యువ జంటను ఇసుక ట్రాక్టర్ మృత్యువు రూపంలో కబళించింది. ఈ ఘటన బుధవారం రాత్రి నకిరేకల్ మండలంలోని తాటికల్ గ్రామం శివారులో చోటుచేసుకుంది. వివరాలు.. కేతేపల్లి మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన చిత్తలూరు మహేష్(23) అదే గ్రామానికి చెందిన రుషిత(19)ను నెల రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారిద్దరు కలిసి బుధవారం సాయంత్రం పల్సర్ బైక్‌పై నల్లగొండలోని తమ బంధువుల ఇంటికి వచ్చి వారిని కలిసి పండ్లు తీసుకొని తిరిగి రాత్రి స్వగ్రామానికి బయల్దేరారు. రాత్రి 8.45 గంటల సమయంలో నకిరేకల్ మండలం తాటికల్ గ్రామ శివారుకు చేరుకోగానే ఎదురుగా అతివేగంతో వస్తున్న ఇసుక ట్రాక్టర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడిపోయారు. బైక్‌ను నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో మహేష్ అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్ర గాయాలపాలైన రుషితను తాటికల్ గ్రామస్తులు 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న నకిరేకల్ ఎస్‌ఐ సుధీర్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


నుజ్జునుజ్జయిన బైక్


ఘటనా స్థలంలో మహేష్ మృతదేహం

## చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి


నాగరాజు మృతదేహం

**వేములపల్లి:** చేపల వేటకు వెళ్లి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామపంచాయతీ పరిధిలోని రావువారిగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రావువారిగూడేనికి చెందిన పేరబోయిన నాగరాజు(25) వ్యవసాయం చేసుకుంటూ చేపల వేటకు వెళ్తుంటాడు. మంగళవారం ఉదయం నాగరాజు గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా అక్కడ అతడి చెప్పులు మాత్రమే కనిపించాయి. దీంతో గ్రామస్తుల సహకారంతో చెరువులో గాలించగా అతడి ఆచూకీ లభించలేదు. తిరిగి బుధవారం ఉదయం గ్రామస్తులతో కలిసి మరోసారి చెరువులో వెతకగా నాగరాజు మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని నాగరాజు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి పేరబోయిన వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. చేపలు పట్టే వల కాళ్లకు చిక్కుకొని నాగరాజు మృతిచెందినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## మృతుడి అంత్యక్రియలు చేసిన పోలీసులు


అంత్యక్రియలు చేస్తున్న పోలీసులు

**యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఓ యువకుడికి స్థానిక పోలీసులే బుధవారం అంత్యక్రియలు చేశారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టకు చెందిన మైతిలి కిషోర్‌కుమార్(28) పట్టణంలోని కొత్త గుండ్లపల్లి శివారులోని హైటెన్షన్ స్తంభం పక్కన ఉన్న చెట్టుకు ఉరేసుకొని మంగళవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి గతంలోనే మరణించగా.. తల్లి ఘటనా స్థలానికి చేరుకుంది. ఆర్థిక పరిస్థితి బాగోలేక ఆ తల్లి కొడుకు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లలేని స్థితిలో ఉండటం చూసి చలించిపోయిన యాదగిరిగుట్ట సీఐ రమేష్ భువనగిరి ఏరియా ఆస్పత్రిలోనే కిషోర్‌కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం చేయించి యాదగిరిగుట్టకు తిరిగి తీసుకొచ్చి అంత్యక్రియలు చేయించారు.

## ప్రతిభను వెలికితీసేందుకు క్రీడాపోటీలు దోహదం

- ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్

**భువనగిరిటౌన్:** విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడాపోటీలు దోహదపడతాయని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. భువనగిరిలో రాజీవ్ క్రికెట్ ట్రోఫీ జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలు జాతీయ భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. భారతదేశంలో జరుగుతున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంజాల రామాంజనేయులు గౌడ్, పోత్నప్రమోద్ కుమార్, బర్రె జహంగీర్, దర్గాయి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్

### అట్రాసిటి కేసులో ఆరు నెలలు జైలు శిక్ష

**రామగిరి(నల్లగొండ):** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి బి. తిరుపతి బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. నల్లగొండ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన భాషపాక హరికృష్ణ, హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌కు చెందిన అల్ల విజయ్‌ప్రతాప్‌రెడ్డికి 2016లో ఓ ఇంటి విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో విజయ్‌ప్రతాప్‌రెడ్డి తనను కులం పేరుతో దూషించి అవమానించాడని హరికృష్ణ నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో అప్పటి ఎస్‌ఐ హన్మంతరెడ్డి కేసు నమోదు చేసి విజయ్‌ప్రతాప్‌రెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసు బుధవారం తుది విచారణకు రాగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలతో ఏకీభవరించిన నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి బి. తిరుపతి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి యాక్టు ప్రకారం విజయ్‌ప్రతాప్‌రెడ్డికి ఆరు నెలలు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

### 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**చిట్యాల:** మండలంలోని పిట్టంపల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో నిల్వ చేసిన పది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం చిట్యాల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. ధరావత్ వెంకటేష్ అనే వ్యక్తి పిట్టంపల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో గదిని అద్దెకు తీసుకొని కొంత కాలంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం వ్యవసాయ క్షేత్రంపై దాడి చేసి వాహనంలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న గుగులోతు రూప్‌సింగ్, గుగులోతు బుజ్జి, ధరావత్ వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడినవారంతా కొంతకాలంగా వివిధ గ్రామాలలో పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

## వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ


వృద్ధురాలిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎస్పీ వెంకటగిరి

**మిర్యాలగూడ టౌన్:** గుర్తుతెలియని వ్యక్తులు వృద్ధురాలు మెడలో బంగారు గొలుసు చోరీ చేశారు. ఈ ఘటన మిర్యాలగూడ మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన కాకనూరి ముత్యాలమ్మ తన ఇంటి ఆవరణలో మంచంపై కూర్చొని ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి గేటు తెరిచారు. ఒకరు ఆరుబయట బైక్‌పై ఉండగా మరో వ్యక్తి వృద్ధురాలు వద్దకు వెళ్లి ‘నీ కొడుకు యాదగిరి ఉన్నాడా అవ్వా’ అంటూ వృద్ధురాలితో మాట్లాడుతూ.. ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు లాక్కోని పరారయ్యారు. ముత్యాలమ్మ కుమారుడు ఇంటికి రాగానే జరిగిన విషయం తెలియజేయడంతో అతడు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి లక్ష్మీపురం గ్రామానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితుడిని పట్టుకోవాలని అన్ని పోలీస్ స్టేషన్‌లకు సమాచారం అందించి పోలీసులను అప్రమత్తం చేశారు.

## కారులో నుంచి రూ.4.74లక్షలు చోరీ


చోరీ జరిగింది ఈ కారులో నుంచే..

**మిర్యాలగూడ:** గుర్తుతెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులగొట్టి రూ.4.74లక్షలు చోరీ చేశారు. ఈ ఘటన బుధవారం దామరచర్ల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన అజ్మీరా మాలు, వెంకట్‌రెడ్డి, అంజి, రామారావు, లక్ష్మణ్, రమేష్, రాజేంద్రబాబు కలిసి గతంలో కొనుగోలు చేసిన ఇంటి స్థలాన్ని వేరొక వ్యక్తికి విక్రయించారు. స్థలాన్ని బుధవారం మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనుగోలుదారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేయగా.. అతడు వీరికి ఇవ్వాల్సిన రూ.4.74లక్షల నగదును ఇచ్చాడు. ఆ నగదు తీసుకొని వీరు తిరిగి దామరచర్లకు బయల్దేరారు. దామరచర్ల మండల కేంద్రంలోని హోటల్ గ్రాండ్‌శ్రీ ఎదుట కారును నిలిపి డబ్బును అందులోనే పెట్టి భోజనం చేయడానికి హోటల్ లోపలికి వెళ్లారు. ఈ క్రమంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులగొట్టి అందులోని రూ.4.74లక్షల నగదు తీసుకొని పారిపోయారు. భోజనం చేసి వచ్చిన తర్వాత కారు అద్దం పగులగొట్టి ఉండటం, అందులోని డబ్బు లేకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దొంగలు చోరీ చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. కారును ముందు నుంచే అనుసరిస్తున్న ఇద్దరు దొంగలు బైక్‌పై హెల్మెట్ పెట్టుకొని వచ్చి కారు అద్దాలు పగులకొట్టి డబ్బులు చోరీకి పాల్పడినట్లు బాధితులు పేర్కొన్నారు.

## రైతులకు పంట రుణాలు రెన్యూవల్ చేయాలి

- బ్యాంకర్లను ఆదేశించిన కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్


మాట్లాడుతున్న నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

**రామగిరి(నల్లగొండ):** రుణమాఫీ పొందిన రైతులకు పంట రుణాలను రెన్యూవల్ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ సమావేశం నిర్వహించి పంట రుణాలు, యూరియా, ఎరువుల నిల్వలు, పంపిణీపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కొత్త పంట రుణాలు, రెన్యూవల్‌లో ఆశించిన పురోగతి లేదని, రూ.768 కోట్ల రుణమాఫీకి గాను రూ.272 కోట్లు మాత్రమే రెన్యూవల్ చేశారన్నారు. సీజన్ పూర్తవుతున్నందున వారం రోజుల్లో రుణాలు రెన్యూవల్ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో యూరియా, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, వ్యవసాయ శాఖ జేడీ శ్రావణ్, ఎల్‌డీఎం శ్రామిక్, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

**పోస్టర్ ఆవిష్కరణ**

వినాయక చవితి సందర్భంగా పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. ఈ మేరకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారు రూపొందించిన పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 16న పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్ నందు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2000 మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవి, పర్యావరణ ఇంజనీర్ సురేష్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాస్, పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ సమైక్యతా వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

**రామగిరి(నల్లగొండ) :** సెప్టెంబర్ 17న తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. వేడుకల నిర్వహణపై బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేదిక, వీఐపీలు, అధికారులు, మీడియా, ఇతరులకు ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాటు చేయాలని ఆర్డీఓ, అర్బన్ తహసీల్దార్‌కు సూచించారు. వివిధ శాఖలు సాధించిన ప్రగతి సందేశాన్ని రూపొందించాలని ముఖ్య ప్రణాళిక అధికారిని ఆదేశించారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారని తెలిపారు. దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటేలా స్కూల్ విద్యార్థులతో సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించాలని డీఈఓను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్, ఆర్డీఓ రవి, డీఎస్పీ(ఏఆర్) హనుమంతరావు, అధికారులు పాల్గొన్నారు.

### రేషన్ దుకాణంపై కేసు నమోదు


తిప్పర్తిలోని రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

**రామగిరి(నల్లగొండ):** తిప్పర్తి మండల కేంద్రంలోని రేషన్ దుకాణంపై సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు కేసు నమోదు చేశారు. వివరాలు.. తిప్పర్తి మండల కేంద్రంలోని నస్రీన్ సుల్తానాకు చెందిన రేషన్ దుకాణంలో హైదరాబాద్ సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ-పాస్ మిషన్‌లో రేషన్ బియ్యం పంపిణీ వివరాలను పరిశీలించగా 20 క్వింటాళ్ల మేర బియ్యం తక్కువగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో తెలంగాణ స్టేట్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ కంట్రోల్ ఆర్డర్–2016 ప్రకారం సదరు రేషన్ దుకాణ యజమానిపై 6ఏ కేసు నమోదు చేశారు. రిపోర్టును అడిషనల్ కలెక్టర్‌కు సమర్పించారు. విచారణ అనంతరం సదరు దుకాణంపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. తనిఖీలు నిర్వహించిన వారిలో పాష, పుల్లయ్య, బ్రహ్మచారి, రెవెన్యూ ఆర్‌ఐ నరహరి ఉన్నారు.

### టీవీఎస్ మోపెడ్ అదుపుతప్పి వృద్ధుడు మృతి

**నల్లగొండ క్రైం:** నల్లగొండ మండలంలోని చందనపల్లికి చెందిన తంతనపల్లి బక్కయగౌడ్(83) బుధవారం నల్లగొండ నుంచి స్వగ్రామానికి టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తుండగా పానగల్ చెరువు కట్ట వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. అతడి తలకు తీవ్రగాయం కావడంతో ఆస్పత్రికి తరలించే లోపే మృతిచెందాడు. బక్కయ్యగౌడ్ పంచాయతీరాజ్ విభాగంలో ఎల్‌డీసీగా పనిచేసి పదవీ విరమణ పొందిన తర్వాత అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఆయన మృతి పట్ల జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చాడ కిషన్‌రెడ్డి, చకిలం అనిల్‌కుమార్, చందనపల్లి సర్పంచ్ సురిగి మణెమ్మ సంతాపం ప్రకటించారు.

## ఆపరేషన్ వికటించి మహిళ మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన


మాతంగి రాధ (ఫైల్)


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

**మిర్యాలగూడ అర్బన్:** ఆపరేషన్ వికటించి మహిళ మృతిచెందిన ఘటన మిర్యాలగూడ పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం రేగులగడ్డ గ్రామానికి చెందిన మాతంగి రాధ (38) కడుపు నొప్పితో బాధపడుతూ గత నెల 30న మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో గల అరవింద్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించిన డాక్టర్ అరవింద్ గర్భసంచి తొలగించాలని సూచించారు. దీంతో ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగించారు. వారం రోజుల తర్వాత ఇంటికి వెళ్లిన రాధకు తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు తిరిగి ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను పరీక్షించిన సదరు వైద్యుడు ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగించిన ప్రదేశం నుంచి రక్తస్రావం జరుగుతుందని గుర్తించి వైద్యం చేయడం ప్రారంభించారు. అయినప్పటికీ రాధ ఆరోగ్యం బాగుపడకపోగా మరింత క్షీణించింది. దీంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు నల్లగొండకు తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం మృతిచెందింది. గర్భసంచి ఆపరేషన్ వికటించడంతోనే రాధ మృతిచెందిందని బంధువులు అరవింద్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఆస్పత్రి యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించడంతో మిర్యాలగూడ టూటౌన్ సీఐ రాఘవేందర్ తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని ఆస్పత్రిలో ఉంచిన బంధువులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పెద్ద మనుషుల జోక్యంతో మృతురాలి కుటుంబానికి రూ.3లక్షలు ఇచ్చి ఆందోళనను విరమింపజేశారు. మృతురాలి భర్త ఏడుకొండలు గతంలోనే మృతిచెందగా.. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ విషయంపై డాక్టర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.